# దొంగగొడ్డు



తీసికాస్తున్న ఎండలో తలదాచుకొందామని చెట్టునీడను చేరితే ఆ చెట్టే విరిగి మీద పడింది. గుక్కెడు నీళ్ళతో గొంతుతడుపుకొందామని ఓ బావిలో దిగితే ఆ బావి ఉర్లిపైన పడింది. ఆత్మరక్షణకోసమని అందాల పిడిబాకును పక్కలో పెట్టుకొంటే ఆదమరిచిన నిద్రలో అటుయిటు పొర్లినపుడు ఆ బాకే పక్కలో బల్లెమయింది!

అన్నీ కలసి ఒక్కసారిగా ఒకమనిషి బతుకులో సంభవించడం అసంభవం. అయినా అన్నీకలిసి తనకే జరిగినట్లు తపించిపోయాడు నీలమేఘం!

నీలమేఘం పిడికిళ్ళు కసికసిగా పిసుకుతున్నాయి గాలిని. పండ్లు పటపట పరీక్షించుకొంటున్నాయి శక్తిని. కండ్లు చెరుగుతున్నాయి చింతనిప్పుల్ని. నిక్కపొడుచుకొన్న వెంట్రుకలు చుక్కల్నే చూస్తున్నాయి!

అయితే– అతడు నిలబడుకొనింది బోనులో అనీ... ఆ బోను ఉన్నది న్యాయస్థానంలో అనీ... తెలిసే సరికి పులిలా విజృంభించిన నీలమేఘం– పిల్లే అయ్యాడు.

"ఇక దిగండి!" అంటున్నాడు బోను తలుపు తెరిచిపట్టుకొన్న కోర్టు జవాను.

నీలమేఘం తలపైకెత్తి ఒక్కసారి కోర్టంతా కలయచూశాడు.

అశోక ధర్మచక్రంకింద ధర్మపీఠంమీద కూర్చున్న న్యాయాధిపతి తీరిగ్గా ఏవో కాగితాలను తిప్పుకొంటున్నాడు. వాదనలో నెగ్గుతామనుకొంటున్న వకీలు కీలుకీలులో అహాన్ని చొప్పించుకొని బొమ్మలా బిర్రబిగుసుక కూర్చున్నాడు. అతని వెనకగా నిలబడ్డ ఓనలుగురు రైదుగురు కసికసిగా చూస్తూ ముసిముసిగా నవ్వుతున్నారు.

నీలమేఘం తల వాలిపోయింది. బోనులో నుండి దిగాడు. మెల్లగా బయటికి నడుస్తున్నాడు. ముసిముసినవ్వులు వికటాట్టహాసాలై వీపును పొడుస్తున్నాయి. పొంగి పొరలడానికి సిద్ధమైన కండ్లు సిగ్గుతో తటపటాయిస్తున్నాయి. వంచిన తల పైకెత్తకుండా నడుస్తూనే ఉన్నాడు.

ఉన్నట్టుండి అతని భుజంమీద ఓ చేయి పడింది. ఉలిక్కిపడ్డట్టు తలపైకెత్తినాడు.

ఎదురుగా తన తరఫున వాదించిన వక్కీలు!

ఇద్దరి చూపులు ఒక్క క్షణం కలుసుకొన్నాయి.

"కాశికి పొయ్‌నా గాసి తప్పలేదన్నట్లుండాదే యవ్వారం. నాయస్తానంలోనే ఇంత అన్నాయం జరిగితే ఇంకేంఁవిజెయ్యాల? బతుకు నడీదిపాలయిందే! ఇంక నేనెట్లా బతకాలబ్బా?" అన్న అర్థింపు ఉంది నీలమేఘం చూపుల్లో.

"నన్ను మాత్రం ఏం చెయ్యమంటావ్? నాశక్తివంచనలేకుండా వాదించానుకదా? న్యాయం వేరు. చట్టంవేరు. చట్టాన్ని సంతృప్తిపరచలేని న్యాయం అన్యాయంగానే లెక్క కెక్కుతుంది. ఇప్పుడదే జరిగింది. ఏం చేద్దాం?"– అన్న నిస్సహాయతను నింపుకొన్నాయి వక్కీలు కండ్లు.

అయినా తెపరాయించు కొన్నాడు వక్కీలు. అది అతని వృత్తిధర్మం. ఒకడు తనచేతిలో చనిపోయాడని తనవృత్తిని మానుకోలేడు డాక్టర్. ఒక్కడు తన వాదనలో ఓడిపోయాడని బెంబేలుపడిపోడు వకీలు!

కర్తవ్యనిర్వహణ పేరుతో పెట్టుబడిలేని వ్యాపారంలోవాళ్ళు దక్షులు.

అందుకే–

"చూడు నీలమేఘం! ఇంతకే ఇలా డీలా పడిపోతే ఎలా? దీనికి పైకోర్డు ఉంది. ఆ కోర్టుకు పైకోర్టు ఉంది. అప్పీలు చేద్దాం. శక్తివంచన లేకుండా పోరాడుదాం. నువ్వేమీ భయపడవద్దు" అని తట్టివదిలాడు.

గంగిరెద్దులాగ తల ఊపినాడేకానీ నీలమేఘం. అప్పటికే తన కొంప ఆరిపోయిన సంగతి వకీలుకేంతెలుస్తుంది?– అతడు ఆ సమయానికి వకీలుగా ఎంత చెప్పాలో? ఏమి చెప్పాలో?– అదే చెప్పాడు.

నిస్సహాయంగా చూస్తూ నిలబడ్డాడు నీలమేఘం.

ఎవ్వరో తన్నుచూసి పడిపడీ నవ్వుతున్నట్లు... ఆ నవ్వులు గుండెల్ని తూట్లు పొడుస్తున్నట్లు–

తట్టుకోలేక గుండెల్ని చేతిలో పట్టుకొని అడుగుదీసి అడుగు ముందుకువేశాడు నీలమేఘం. రెండుచేతుల్ని ఎవరో చేతుల్లోకితీసుకొన్నారు. ఒక్కసారి చేతులవైపు పరీక్షగా చూసి తలపైకెత్తాడు నీలమేఘం. ఊళ్ళోవాళ్ళు ఎదురుగా ఉడ్డగట్టి నిలబడ్డారు.

"సూడన్నా! వకీలుచెప్పిందంతా ఎనకనేవుండి వింటిఁవి. పైకోరట్టుకు పోదాఁవంటా వుండాదే! అప్పిటికి ఇక్కడ నాయం లేనట్టేగదా? నాయంలేనప్పుడిదెట్లా కోరట్టవుతుంది. కోరట్టు కానప్పుడు వాళ్ళుజెప్పింది నాయవెట్టా అవితింది. ఈడ నాయం కాన్ది ఇంకొక్క కోరట్టులో నాయంగా ఎట్లా సెలామణి అవితింది. అంతా తలతిక్క యవ్వారంగా ఉండాదే. పోనీ! ఈ బూమ్మీద సీలలు కొట్టుకోని ఉండబొయ్యేది లేదెవుడూ? నీ నోట్లో మట్టిగొడ్తే వాళ్ళ నోళ్ళల్లో మట్టి గొట్టేదానికి కాసుకొనే ఉంటాడు దేవుడు. లేదంటే ఓర్సుకోవాల. కానీ సూద్దాం. వాళ్ళొచ్చి నీ కయ్యిలో మడకలు కట్టిన కాలానిగ్గదా?"

ఊరు ఊరంతా తనమాట మీద నిలబడుతుందని తెలుసు నీలమేఘానికి. అయితే ప్రయోజనం?- తనలాంటి ఓ సామాన్యుడికి కోర్టు ఉత్తర్వుల్ని ధిక్కరించే దమ్ముకావద్దూ?

తానేమీ ఓ దేశనాయకుడు కాదు- తనకు జరిగిన అన్యాయానికి ప్రతీకారంగా దేశవ్యాప్తంగా 'బంద్'లు జరిపించడానికి!

కనీసం ఒక గుమస్తా అయినా కాదు. తనలాంటి గుమస్తాలందరూ కలిసి తనమీద సానుభూతిగా 'సమ్మె'లు జరిపించడానికి!

తాను కేవలం ఒక రైతు. ఎద్దుల గొట్టి ముద్దలు తినే రైతు!

ఆ రైతును లోకానికి పట్టెడన్నము పెట్టే పరమాత్ముడని కీర్తిస్తుంది కవిలోకం.

'రైతులు దేశానికి వెన్నెముకలు!' అని భజన చేస్తుంది రాజకీయరంగం!

పట్టెడన్నం పెట్టగల మనిషి వెన్నెముకే చట్టంచేతిలో పడి విరిగిపోయింది. వెన్నెముకలేకపోతే శరీరమే లేదు. శరీరం ఉండీ లేనట్లయిన నీలమేఘం- మారు మాట్లాలేక తలవంచాడు. వంచిన తల ఎత్తకుండా ముందుకు నడుస్తున్నాడు.

సినిమాల్లో అయితే సందర్భోచితంగా ఆ నడకకు తగ్గట్టుగా వెంటనే ఓ పాట శ్రావ్యంగా వినిపించేది. కానీ ఇది జీవితం. నీలమేఘం గుండెలు కూడా పాడుతున్నాయి పాట! అయితే ఆ పాటకు సాహిత్యాన్ని సమకూర్చేవాళ్ళెవ్వరు? సంగీతాన్నందించే వాళ్ళెవ్వరు??

నీలమేఘం నడుస్తూనే ఉన్నాడు.

ఊళ్ళోవాళ్ళు అతని వెంటపడలేక కోర్టు ఆవరణలోని చెట్ల క్రింద కూలబడ్డారు. చెట్లమీద కాకులు గోలచేస్తున్నాయి.

"సద్దు సద్దు!" అని హెచ్చరిస్తున్నాడు కోర్టు జవాను.

సద్దుమణగలేదు. పొద్దు ఆగలేదు. నీలమేఘం నడక మానలేదు.

* * *

అంతో ఇంతో పేరున్న మనిషిపక్కన చేరి ఎంతోకొంత పేరు సంపాదించుకోవాలని తాపత్రయపడే మనిషిమాదిరి అంతో ఇంతో పేరున్న ఆ పట్టణం పక్కనే తల ఎత్తిందాపల్లె!– పేరు పాడిపేట.

పాడిపేటలో పదిపదుల గడపలున్నాయి. కొన్ని మిద్దింటి గడపలు. కొన్ని పూరింటి గడపలు. మరికొన్ని గుండు గుడిసె గడపలు. అయినా అన్నీ ఒక దాని ప్రక్కన మరొకటిగా ఉన్నాయి. భారతదేశం సాధించిన సమసమాజానికి దర్పణం పట్టినట్లుగా!

పూరింట్లో చట్టిపిడత కాసింత పులుసుకోసం మిద్దింటి గడప తొక్కుతుంది. మిద్దింటి స్టీలులోటా గిద్దెడు పాలకోసం పూరింటి గడప దాటుతుంది. చట్టిపిడత... స్టీలు లోటా అప్పుడప్పుడు సరసాలాడుకొంటుంటాయి.

మిద్దింటి మగరాయుళ్ళు గనిమలమీద నిలబడి పంచె అంచుల అందాన్ని పరికించినట్లే– కయ్యల్లో ఒళ్ళు వంచిన పడుచుదనం వొంటిమీద వంపుల్ని తినేస్తుంటే– తినడం ఒకరి వంతు కష్టపడడం మరొకరివంతుగా తలపోసి పనుల్లో తలమునకలవుతూ ఉంటుంది. అరమరిక లెరుగని ఆ పల్లె జీవనం– కర్మసిద్ధాంతాన్ని బాగా ఒంటబట్టించుకొన్న ఓ తపోవనం!

ఆ ఊళ్ళో మూడుమడకల సేద్యగాడు ముత్తుస్వామి!

ముత్తుస్వామి తండ్రి పెరియస్వామి. అతగాడు ఆ ఊళ్ళోనే మూడు మూడు ఆరు మడకల సేద్యగాళ్ళు పసుపులేటి వాళ్ళ ఇంట్లో సేద్యగాడుగా బతికాడు.

సేద్యగాడి కొడుకు సేద్యగాడుగానే జీవించడం మనదేశ సంప్రదాయం. ఈ సంప్ర దాయాన్ని ఎదిరించడం ఏటికి ఎదురీదినంత పని! అయినా పెరియస్వామి తదనంతరం ముత్తుస్వామి పసుపులేటి ఇంటితట్టు తిరిగి రెండుచేతులు జోడించి ఒక్కదండం పెట్టేసి నేరుగావెళ్ళి ఆగ్రామ కరణంగారిముందు చేతులుకట్టుకొని నిలబడ్డాడు.

కరణం– కరణాన్ని నమ్మితే మనలేడన్నాడు కానీ సుమతి– కరణాలు తలుచుకొంటే ప్రతి బతుకులో తిరణాలే!

ముత్తుస్వామి– కరణంగారు కాలితో చెప్తే చేత్తో చేస్తున్నాడు.

రాజుగారు తలుచుకొంటే దెబ్బలకు కొదవలేదన్న సామెత పాతబడి పోయింది, రాజులు పోవడంతో!– కానీ కరణంగారు తలుచుకొంటే భూములకు కొదువలేదన్నది నిత్యనూత్నంగా వెలుగొందుతూ ఉంది ప్రజాస్వామ్యవ్యవస్థలో!!

గ్రామకరణంగారు ముత్తుస్వామి 'స్వామిభక్తి'కి ముగ్ధుడయ్యాడు. ఏటి ఒడ్డున ఎకరా పొలం చూపించాడు. కాడెద్దులు కొనుక్కోవడానికి అప్పు మంజూరు చేయించాడు. ముత్తుస్వామి కాడెద్దుల సేద్యగాడయ్యాడు.

ఆ ఏడాది ముత్తుస్వామి ఎకరాపొలంలో వేరుశెనగ పంట పెట్టాడు.

పొలమే ఇల్లు... ఇల్లే పొలంగా పోరకలాడిన ఫలితంగా వేరుశెనగ పంట ఇనుమిక్కులుగా పండింది. ఆ ఏడు ధరకూడా బాగా పలికింది. కళ్ళంలో కాయలు కళ్ళంలో ఉండగానే అమ్మకానికి వచ్చింది. ముత్తుస్వామి కాయలు కొలిచాడు. మొత్తం చేతికి తీసుకొన్నాడు.

డబ్బు చేతికి వస్తే ఎవరైనా మూడుముళ్ళువేసి భద్రపరుచుకోవడానికే మునాసపడతారు.

కానీ డబ్బుచేతికి తీసుకొన్న ముత్తుస్వామి తలవంచాడు. వంచిన తలఎత్తకుండా నడిచాడు. అలవాటుపడ్డ కాళ్ళు. అటు ఇటు కాకుండా నేరుగా నడిచాయి. కరణంగారి ఇంటి గడప దాటాయి. అప్పుడు అలవాటుగా తల పైకిలేచింది.

ఎదురుగా కరణంగారు!

వసారాలో వాలుకుర్చీలో వాటంగా పడుకొన్నాడు కరణంగారు. ముద్దుల మనుమడు తాత బొజ్జ మీత తైతక్కలాడుతూ సగం తెల్లగా సగం పుల్లగా గోగునార టెంకాయనార కలగలిపినట్లుగా ఉన్న గుబురుమీసాల్ని పట్టి గుంజులాడుతూ ఉంటే- వాలుకుర్చీలో ఉలికులికిపడుతూ నవ్వుల్ని ఒలకపోస్తున్నాడు కరణంగారు.

ముత్తుస్వామి చేతిలో మొత్తాన్ని కరణంగారి పాదాల దగ్గర ఉంచాడు.

సాష్టాంగపడి నమస్కరించాడు.

మనంవణ్ణి బుజ్జగిస్తూ బొజ్జమీదనుంచి కిందికి దింపి పైకిలేస్తున్నంత ఊపులో ముందుకు లేచినట్లులేచి వాలుకుర్చీలోనే హుందాగా కూర్చొని అంతా రెప్పపాటులో గ్రహించగలిగినా ఏమీ ఎరగనట్లు 'ఏంవిటిది ముత్తూ?' అని ముద్దుగా అడిగాడు.

"తవంరు బెట్టిన బిచ్చంవే గదయ్యా?"

ముద్దుల మనుమణ్ణి అమాంతంగా బొజ్జమీదికి లాక్కొని ముద్దులతో ముంచేశాడు కరణంగారు. వసారా పందిరి గుంజమీద రెండు పిచ్చుకలు ముక్కుకు ముక్కు మోటించి పిచ్చిగా అరుస్తున్నాయి.

"ముత్తూ! ఆ మొత్తాన్ని చేతికి తీసుకో!" కరణంగారు ఆదేశించినట్లన్నారు.

ముత్తుస్వామి వంగలేనట్టుగా వినయంగా వంగి తీసుకొనేదానికి ఇష్టంలేనట్లుగా తీసుకొని రెండడుగులువెనక్కి వేసి రెండు చేతులు కట్టుకొని నిలబడ్డాడు.

"ముత్తూ! కొర్రకంకు గింజపడ్తుంది. గింజపట్టేకొద్దీ వంగుతుంది. ఇంతకంటే చెప్పాల్సిందేంవీ లేదు. అంతకంటే బతుకులో నేర్చుకోవాల్సిందసలే లేదు. పో!" అన్నాడు కరణంగారు.

వెళ్ళిపోయాడు ముత్తుస్వామి.

అయితే కొర్రకంకు సిద్ధాంతాన్ని బాగాఒంటపట్టించు కొన్నాడు. అయిదేండ్లు తిరగముందే- 'ఆయనకేం వబ్బా అయిదెకరాలాసాంవి!' అనిపించుకొన్నాడు.

ఎకరాతో ఎకరా కలుస్తూ ఉంటే- ఎంతోమంది ముందుకు వచ్చారు 'నేనిస్తానంటే నేనిస్తా పిల్లను!' అని. కలసి వస్తుంటే కాదనడమెందుకని కరణం గారు ముందు నిలబడేసరికి- కానున్న కార్యాన్ని గంధర్వులు నిర్వహిస్తారన్నట్లుగా అంతా అందంగా హుందాగా జరిగిపోయింది.

ముత్తమ్మ ముత్తుస్వామి ఇంటికి కొత్తఅందాలు సమకూర్చింది.

అయిదెకరాల భూస్వామి కావడానికి అయిదేండ్లు పట్టింది ముత్తుస్వామికి. అయితే ఇద్దరు బిడ్డల తండ్రి కావడానికి రెండేండ్లు అవసరం లేకపోయింది.

ముత్తమ్మకు పురుడుపోసుకోవడమంటే చచ్చిబతికినంతపని! "చావడమెందుకు? బతకడమెందుకు? సాఫీగా 'ఆపరేషన్' చేయించుకుంటే సరిపోతుంది" అని ముత్తుస్వామి ఆలోచిస్తూనే ఉన్నాడు. అంతలోనే ముత్తమ్మకు మళ్ళీ నెలతప్పింది.

ముత్తమ్మకు మతి తప్పినంత పని అయింది.

పడవలసిన యమయాతన మనసులో మెదిలేసరికి ముత్తమ్మకు మూడు చెరువుల నీళ్ళు తాగినంత పని అయింది. గండం నుండి గట్టెక్కించమని ఏడుకొండలవాడికి ముడుపుకూడా గట్టింది. ముడుపును చూసి మురిసిపోతూ మగనికి చాటుగా లిక్కి గంగులక్క దగ్గర నాటుమందు మింగింది.

నాటుమందు నక్సలైటు చేతిలో నాటుబాంబులా పనిచేసింది. గండం తప్పించినట్లే అసలు ప్రాణానికి గండంతెచ్చి పెట్టిందా మాయదారి నాటుమందు. ఆ గండం ముత్తుస్వామి రూపాయను పైసాలాగా చూసినాడన్న పేరును నిలబెట్టింది. కానీ- ముత్తమ్మ ప్రాణాల్ని మాత్రం నిలబెట్టలేక పోయింది.

నూరేండ్ల బతుకు ముత్తుస్వామికి మూన్నాళ్ళముచ్చటగా మిగిలింది.

అప్పుడే రాయలసీమలో భీకరమైన కరువు వచ్చింది. బావులు చెరువులు అడుగంటాయి. రైతాంగం ఒక మబ్బుతునకకోసం ఆకాశంవైపు ఆశగా చూస్తూఉంది. వడగాల్పులు గూబల్ని అదరగొడుతున్నాయి! పరిస్థితి ఇలానే కొనసాగితే పల్లెలకు పల్లెలే వలసపోవలసిన స్థితి వద్దంటే ఏర్పడేటట్లుగా ఉంది.

పసికూనలకు పాలుకరువు. పొలంలో పైరుకు నీళ్ళు కరువు!

ఏటి ఒడ్డున కాబట్టి ముత్తుస్వామి బావిలో బానకుబాన నీళ్ళూరుతున్నాయి.

ఇలా ఇంట్లో అలా పొలంలో ముత్తుస్వామి సతమతమై పోతున్నాడు.

ఆ పల్లెలో తొక్కని గడపలేదంటూ తిరిగి- ఏ తల్లినో బతిమాలి చంటిబిడ్డలకు చనుబాలు పట్టిస్తున్నాడు. పొలంలో పాతాళ గంగను పట్టుబట్టి పైకిదెచ్చి- ఎకరాపంట ఎలాగో ఎక్కిస్తున్నాడు.

కరువు కాటకాల ఇరకాటంలోపడి విల విల లాడిపోతున్నా- ఆ పల్లె గుండెల్లో జాలిమాత్రం ఇంకిపోలేదు. ఊళ్ళోవాళ్ళంతా ముత్తుస్వామి పరిస్థితికి జాలిపడుతూనే ఉన్నారు.

వీటన్నింటినీ పట్టించుకొనే తీరికా కోరికా ఉండదు కాలపురుషుడికి.

కరుణా రహితుడైన కాల పురుషుని చేతిలో ఇరుక్కొన్నామని కాలూ చెయ్యి కట్టిపెట్టుకొని కూర్చోలేదు మానవుడు! వాడి పెనుగులాట వాడిది!

ఈ పెనుగులాటలో మిందు కిందులు కావచ్చు. కిందు మీదులు కావచ్చు.

"ఇలా ఎందుకు జరిగింది? ఎలా జరిగింది?" అని ఆలోచించడంకంటే ఎలాచేస్తే పని జరుగుతుందని ఆలోచించే తత్త్వం మొదటి నుండి ముత్తుస్వామి వ్యక్తిగతం. అందుకే- కిందపడినపుడు కుంగక పైకిలేచినపుడు పొంగక చెమటోడుస్తున్నాడు.

బిడ్డలిద్దరు చేతికి ఎదిగివస్తున్నారు. చేతికెదిగిన బిడ్డలు చేదోడు వాదోడుగా ఉంటున్నారు.

ఆడబిడ్డపేరు అనంతమ్మ. చేతనైనంత మట్టుకు పూటపూట అంతోఇంతో ఉడకబెట్టి పోస్తూ ఉంది. కొడుకు నీలమేఘం. మేఘాల్లో నీళ్ళు లేలేకపోయినా వంచిన తలెత్తకుండా పనిపాటా చేసుకొంటున్నాడు.

జోలిమాలిన పనులకు జోలికట్టక పోయేసరికి మంచికి మారుపేరయింది- ఆ ఇల్లు. ఆ ఇంటి మంచితనంముందు ఆఊరే తలవంచింది.

ఇలా ఇంటిపనుల్లో అలా పొలంపనుల్లో సతమతమైపోతూ ఉండిన ముత్తుస్వామి ఇప్పుడు కాస్త ఊపిరిపీల్చుకోగలుగుతున్నాడు. ఊపిరిపీల్చుకోగలిగిన మనిషిని అలానే ఊపిరి పీల్చుకోనిస్తే కాలపురుషుడు కరుణారహితుడు అనడానికి ఆస్కారమే ఉండదు.

చేతికెదిగిన బిడ్డను ఒకరిచేతుల్లో పెట్టే అవసరం కలిగేకుందికి- ముత్తుస్వామి ఊపిరి పీల్చుకోలేక పోతున్నాడు.

ఏ వయస్సుకు ఆ ముచ్చట. అమ్మాయి పెండ్లి చేయాలి. అయితే మళ్ళీ కథమొదటికి తానే చెయి కాల్చుకోవలసి వస్తుంది. అందుకే ఆలోచించాడు. మోటతోలుతూ ఆలోచించాడు. మడక దున్నుతూ ఆలోచించాడు. పొట్ట కర్రకు వచ్చిన జొన్నచేల వైపు చూస్తూ ఆలోచించాడు. రకరకాలుగా ఆలోచించి తుదకు ఒక నిర్ణయానికి వచ్చాడు.

అమ్మాయిని ఒకయింటికి కోడలుగా పంపి, తనయింటికి ఒకకోడల్ని తెచ్చుకో వాలనుకొన్నాడు. ఖర్చులోఖర్చు... పనిలోపని... ఆలోచన అద్భుతంగా ఉందన్నారు ఊళ్ళోవాళ్ళు!

దేవుడిపెండ్లికి అందరూపెద్దలే అన్నట్లు- ఊళ్ళోవాళ్ళందరూ తలకొక్క చేయివేస్తే- ముత్తుస్వామికి ఆలోచించినంతసేపు పట్టలేదు కూతుర్ని కొడుకును పసుపు బట్టలతో నిలబెట్టడానికి!- ఆకాశమంత పందిరి కాకపోయినా ఊరంత పందిరి వేశాడు. భూదేవంత అరుగు కాకపోయినా ఇల్లంత అరుగువేశాడు. ఆ అరుగుమీద కూతురు పూసిన పొగడలా ఉంది. కొడుకు పండిన జొన్నకంకులా ఉన్నాడు. కూతురు పక్కన అల్లుడు... కొడుకు పక్కన కోడలు... ముద్దుగా ఒద్దిగ్గా, కనబడుతున్నారు.

ఊరుఊరంతా ఒకటై అక్షింతలు పలపల వేశారు!

ముత్తుస్వామి జలజల ఆనంద బాష్పాలు రాల్చాడు!!

"మనిషిగా పుట్టడం అదృష్టం. మనిషిగా జీవించడానికి పరిస్థితులు కలసిరావడం మరీ అదృష్టం. కలిసివచ్చిన పరిస్థితులతో బాధ్యతల్ని కలుపుకొని జీవించడం యోగ్యుల లక్షణం. యోగ్యుడైన మనిషి బాధ్యతల నుండి విముక్తుడైనపుడు పొందే ఆనందము... అనుభూతి వర్ణనాతీతం!" అలాంటి ఆనందం అనుభూతుల్లో మునిగి తేలుతున్న ముత్తుస్వామిని చూస్తూ కరణం గారి ఆలోచన.

కలిసి వచ్చిన కాపురం కమ్మగా సాగిపోతుంటే సంవత్సరాలు అంతకంటే సాఫీగా సాగిపోయాయి!

*   *   *   *

"చూడుబాబూ! చాలా ఆలస్యం చేశావు. మూత్రపిండాలు బాగా దెబ్బతిన్నాయి. రక్తం చెడిపోయింది. రక్తం మార్పిడి. ఊహూఁ! నీలాంటివాళ్ళవల్ల జరిగేపనికాదు. మనిషి ఇక ఎక్కువ కాలం బతకలేడు".

డాక్టరు చెప్పిన మాటల్నివిన్న నీలమేఘం కుప్పగా కూలిపోయాడు. డాక్టరుగారి రెండుకాళ్ళను ఒడిసి పట్టుకొన్నాడు.

"అయ్యా! ఎట్లయినా మా అయ్యను బతికించడయ్యా! సచ్చి నీ కడుపున పుడతానయ్యా!"– బావురుమన్నాడు నీలమేఘం.

"చూడు బాబూ! ఇలా ఏడ్చిమొత్తుకుంటే ఏం ప్రయోజనం లేదు. పైగా ఈ అరుపులు ఆర్భాటాలు రోగి చెవిని పడితే ప్రమాదం మరీ తొందర్లో ముంచుకొస్తుంది. సేద్యం చేస్తున్నావు కదా?– ఏటికి నీళ్ళు వెదజల్లితే ఏమైనా ప్రయోజనం ఉంటుందా? అంతే!– ఆయనమీద ఈ స్థితిలో ఏమందులు పనిచెయ్యవు. గుట్టుగా ఇంటికి తీసుకొనిపో. ఈ మందులకనిపెట్టే డబ్బు పెట్టి ఆయన కోరింది కొనిపెట్టు. బతికినన్నాళ్ళు బతుకుతాడు. ఇంతకంటే చేయగలిగిందేమీ లేదు".

ఉన్నదున్నట్లు చెప్పడానికి డాక్టరు వెనకాముందాడలేదు.

గుండె ఆగినంత పనికావడంతో నీలమేఘం అటూ యిటు కాలు కదపలేదు.

అలాగే నిలబడి ఒక్క క్షణం ఆలోచించాడు.

"డాక్టరయ్యా! ఇప్పుడుగాన నేనాయన్ను తిరిగి ఇంటికి తీసుకొనిపోతే ఆ పల్లెకొంపల్లో తలెత్తుకొని తిరగాల్సిన పనేలేదు. కన్నతండ్రికంత మందు మాకూ లేకుండా చేసి సంపిన ముదనష్టపోడని దెప్పి దెప్పిపొడస్తారు కాకులమాదిరగా. ఆ ఉండేదేదో ఇక్కణ్ణే ఉండనీ. పెట్టేదేదో ఇక్కణ్ణే పెడతాను. మీరు సెయ్యగలిగినంత సెయ్యండి. ఆ మీదట బగమంతుడే ఉండాడు".

"సరే! నీ ఇష్టం!" అన్నట్లుగా తల ఊపడంతోనే సమ్మతి తెలిపాడు డాక్టరు.

ఆసుపత్రిలో తండ్రిని ఒక మంచానికి అప్పగించి తల పట్టుకొని కూర్చున్నాడు నీలమేఘం. తల పట్టుకొన్నా... తల కొట్టుకొన్నా... తప్పించుకోలేని పరిస్థితి. ఆ పరిస్థితిలో తపనపడుతూ ఒంటరిగా తనకలాడుతున్నాడు.

ఆ మూడోనాటికి తనకలాడుతున్న అన్నదగ్గరికి తలబాదుకొంటూ వచ్చింది చెల్లెలు– అనంతమ్మ.

అన్నను చూస్తూ చెల్లెలు. చెల్లెల్ని చూస్తూ అన్న. ఆ ఆసుపత్రి ముందర ఓ చెట్టు కింద నిలబడి తండ్రి పరిస్థితిని తలపోసి కలపోసి ఏడ్చారు. ఏడుస్తుంటే ఎవరో ఒకరు సముదాయించాలి... ఎవరున్నారక్కడ? ఉన్నా... ఎవరిబాధల్లో వాళ్ళున్నారు. అందుకే అన్నను చెల్లెలు ఓదారిస్తే చెల్లెల్ని అన్న సముదాయించాడు.

గుండె బరువు కన్నీటి రూపాన కొంతకు కొంత తగ్గితే– ఆచోటులో బాధ్యత పీటవేసుకొని కూర్చొనింది.

"సూడన్నా! ఒక్కరికిద్దరం ఈడ కూసోని సెయ్యబొయ్యేది మాత్రం ఏఁ వుండాది. యాళకంత పెట్టడఁవేగదా?– యాళయాళకు ఇయ్యాల్సిన మందు లేఁవో వాళ్ళే ఇచ్చేస్తారు. అయ్యను నేను సూసుకుంటాను. అక్కడ వదిన వొంటిగా అల్లాడతా ఉంటింది. నువ్విక్కడ కూసుంటే అక్కడ పొలఁవూ పుట్ర సూసుకునే వాళ్ళెవురు?"

తండ్రి బాధ్యతల్ని తలకెత్తుకొని అన్నగారి బాధ్యతల్ని గుర్తుచేసింది చెల్లెలు.

"నువ్వు జెప్పేది బాగానే ఉండాదమ్మా! అయితే... నీది గూడ సంసారఁవేగదా?– నసిగాడు అన్న.

"నా సంసారానికేఁవన్నా? అత్తుండాది. ఆడబిడ్డలుండారు. నేను లేకపోతే అక్కడేవీ కొంపలు మునిగిపోవు. అంతగా అయితే నీ బాఁవార్దే అప్పుడప్పుడొచ్చి సూసిపోతా ఉంటాడు. నువ్వు పొయ్ ఇల్లూవాకిలీ సూసుకో!– అయ్యను నేను కంటికిరెప్పగా కాపాడుకుంటాను."

అభయమిచ్చింది తోబుట్టువు.

అదిగూడా బాగానే ఉందనుకొన్నాడు అన్న!

"ఈ మాయదారిలోకంలో ఏదో పనుండి వచ్చినాము. వచ్చినపని అయిపోయింది. మూటాముల్లె సర్దుకొన్నాం. ఎప్పుడో ఏయేళనో పయాణం?" అని ఆలోచిస్తున్నట్లు పడకమీద పడివున్న ముత్తుస్వామికి ఈ మార్పులు చేర్పులు చెవికెక్కలేదు.

ఖర్చుకు కావలిసినంతడబ్బు చెల్లెలిచేతిలో పెట్టాడు. తండ్రిని జాగ్రత్తగా చూసుకోమన్నాడు. అప్పుడప్పుడు వచ్చి చూసి పోతుంటానని తండ్రికి ధైర్యంచెప్పాడు. నీలమేఘం పల్లెకు పయనం కట్టాడు.

అయ్యను చూడడానికి కూతురు వస్తే- మామను చూడడానికని వారం తిరగకముందే అల్లుడు వచ్చాడు.

అల్లుడు కూతురు మంచానికి చెరిఒక పక్కన కూర్చొని బాధ్యతగా సపర్యలు చేస్తుంటే- ఈగ వాలడంలేదు.

ముత్తుస్వామి తృప్తిగా ఊపిరి పీల్చుకొంటున్నాడు.

ఒకరోజు ఏకాంతంగా అల్లుడు డాక్టర్ని కలుసుకొన్నాడు.

డాక్టర్ని కలుసుకొన్నప్పటినుండి అల్లుడికి మామగారిమీద శ్రద్ధాసక్తులు మరింత ఎక్కువయ్యాయి.

కొడుకు వారం పదిరోజులకు ఒకసారి వస్తున్నాడు.

అల్లుడు మూడుమూన్నాళ్ళకు వస్తున్నాడు.

కొడుకువస్తే ఒక పూట ఉండక తప్పదన్నట్లు ఉంటున్నాడు.

అల్లుడు వస్తే రెండుమూడు పూటలు మామకు ఎదురుగా కూర్చుంటున్నాడు.

కూతురు అల్లుడి మీద ముత్తుస్వామికి అసలే అభిమానం. ఇప్పుడు అది బాగా ముదురుతూ వచ్చింది.

కాలప్రవాహంలో రెండు నెలలు కొట్టుకపోవడానికి ఎక్కువకాలం పట్టినట్లనిపించలేదు.

ఒకరోజు-

ఆసుపత్రికి ఎదురుగా ఆరుబయట చెట్లు. ఆ చెట్లల్లో ఒకానొక చెట్టు క్రింద సిమ్మెంటు బెంచి. ఆ బెంచీ మీద అనంతమ్మ- అనంతమ్మ భర్త కూర్చున్నారు. కరిగించి పోసినవెండిలా వెన్నెల వ్యాపించింది. ఆసుపత్రిలో రోగుల మూలుగులు... వాళ్ళ సపర్యల్లో పగలంతా అలసిసొలసిన వాళ్ళు ఆ ఆరుబయట ఆదమరచి అడ్డదిడ్డంగా పడి పెడుతున్న గురకలు కలగలిసి చిత్రంగా వినిపిస్తున్నాయి. ఉత్తరంగా శేషాచల పర్వతాలు. వెన్నెల్లో ఎగదోసినచీకటి కుప్పల్లా ఉన్నాయి. ఆ చీకటి కుప్పపైనుండి జాలువారపోసిన ముత్యాల్లా కాలిబాట మీద విద్యుద్దీపాలు వెలుగుతున్నాయి.

భార్యభర్తలు ఇద్దరిలో అంతవరకు బాగా వాదులాడుకొన్న వైనం ముఖాల్లో ముద్దగట్టుకొని ఉంది. గుండెల్ని గిలిగింతలుపెట్టే వెన్నెల ప్రాణాలుతోడే ఎండగా పరిణమించి నట్లుంది. కందిన మొగాల్లోంచి చిరుచెమట బిందువులు- వెన్నెల వెలుగులో అందగిస్తున్నాయి.

వాదులాట వగ తెగేసరికి కాసేపు ముభావంగా కూర్చున్నారు. కూర్చొని ఎవరి ఆలోచనల్లో వాళ్ళు సతమతమైపోతున్నారు.

ఎటువంటి సమస్యా పరిష్కారానికైనా కాలం- ఒక గాలం!

దానిపని అది చేస్తూనే ఉంటుంది.

అప్పటికే అర్థరాత్రి సమీపించింది. ఇద్దరు పైకిలేచారు. భార్యను ఒప్పించినామన్న తృప్తి భర్తకు– భర్తను సమాధానపరిచామన్న తృప్తి భార్యకు– ఇద్దరిలోను తృప్తి తొణకిసలాడుతూ ఉంది. మౌనంగా ఆసుపత్రి వైపునడిచారు.

* * * *

ఏడాది గడిచినట్లు తెలియనే లేదు.

ఒక్కరోజు. పొద్దుబాగా వాటారింది. ఊరిముందర చింతచెట్టు కింద కూర్చున్నాడు నీలమేఘం. తొండందారం పేనడానికి పురివదులుతున్నాడు. పెద్దకొడుకు పురి తిప్పుతున్నాడు. చిన్నకొడుకు పక్కన నిలబడి నార అందిస్తున్నాడు.

"ఏందినాయినా నువ్వొదిలే పురి?... కప్పను మింగిన పాంవు మాదిర్తో? అదే తాతయి తేనా?... ఈకడనుండి ఆకడదాకా ఒగిటే మాదిరుండేది!"

ఒక్కసారి చిన్నకొడుకు చిన్నారి మొగాన్ని... మరొకసారి తనచేతుల మీదుగ సాగుతున్న పురిని గమనించాడు నీలమేఘం. కొడుకు చెప్పినమాట నిజమే!– ఒకచోట సన్నం... ఇంకొకచోట లావు. ఒక కప్పను గాదు వరసగా కప్పల్ని మింగిన పాములా ఉంది పురి. అదే తన తండ్రి అయితేనా?...

తండ్రిమాట మనసులో మెదిలేసరికి గిర్రున కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి నీలమేఘానికి. చేతిలో పురి చెప్పకనే ఆగిపోయింది.

అప్పటికి తనతండ్రి గతించి దాదాపు ఏడాది కావస్తూ ఉంది. ఏమిటో ఈ బరువు బాధ్యతలు– ఈ బాధ్యతలమాటున పనుల తొందర. ఆ తొందర్ల సందుల్లో పడితే– ఎటువంటి సంగతులైనా 'ఇంతే సంగతులు' అయిపోతున్నాయి.

"నాయినా! ఇంకెప్పుడనన్లే నాయినా! నువ్వొదలతా ఉండే పురి శానా బాగా ఉండాది నాయినా! నిజ్జింగా తాతొదిలే పురికంటే బాగుండాది నాయినా! ఒరే అన్నా! పురెయ్యొద్దుండ్రా! నాయినకు కోపమొచ్చినట్టుండాది."

గడ్డం పట్టుకొని బ్రతిమలాడుతున్న చిన్నకొడుకువైపు చిత్రంగా చూశాడు నీలమేఘం. అంత బాధలోకూడా ఓ చిరునవ్వు అతనిపెదవుల్ని చీల్చుకొని బయటపడింది.

నీలమేఘం పురివదులుతున్నాడు. చిన్నగా నవ్వుకొంటూ చిన్నకొడుకు నార అందిస్తున్నాడు. పెద్దకొడుకు పురితిప్పుతున్నాడు.

"నువ్వేనా నీలమేఘం?"

ఒక్క క్షణం పురివదలడం ఆపి ఎదుటనిలబడి అడుగుతున్న అతన్ని అదొకరకంగా చూశాడు. నీలమేఘం.

"అడిగినదానికి బదులు చెప్పమంటుంటే?" అన్నట్లు అసహనంగా చూస్తున్నాడు ఎదుట నిలబడిన వ్యక్తి.

"అవును" అన్నాడు నీలమేఘం.

"అయితే నీకు కోర్టు సమన్లుండాయి"

"నాకా?"

"అవును. నీకే!" రెట్టించాడు వచ్చినతడు.

"నాకెందుకబ్బా?" నీళ్ళు నములుతున్నాడు నీలమేఘం.

"తీసుకొంటే తెలుస్తుంది." అని అంటూ వచ్చినతడు వంగి చింతచెట్టు కింద ఒకచిన్న పుల్లను చేతికందుకొన్నాడు. ఆ చెట్టు కిందనే నిలబెట్టిన రెండెడ్లబండి దగ్గరికి వెళ్ళాడు. చేతిలో పుల్లకంత కందెన తీసుకొన్నాడు. నేరుగా వచ్చినీలమేఘం ఎడమచేతిని చేతి కందుకొన్నాడు. పుల్లమీది కందెన్ని బొటనవేలికి పూశాడు. నీలమేఘం నెవ్వెరపడి చూస్తుంటే ఎడమచేతి బొటనవేలిని తాను తెచ్చిన కాగితాలమీద ఒకటి రెండు చోట్ల పొర్లించుకొన్నాడు. కాగితాలను నీలమేఘం చేతిలోపెట్టాడు. అక్కడికి తనపని తీరిపోయినట్లుగా– కాలుమీద కాలు వేసుకొని– నోట్లో సిగరెట్టు పెట్టుకొని మంచంమీద దర్జాగా కూర్చున్నాడు.

నీలమేఘం చేతిలోపురి అతనికి తెలియకుండానే ఎప్పుడు జారిపోయిందో జారిపోయింది. జారిపోయినపురి– పురి వీడుతుంటే– దెబ్బలుతింటున్న పాములా మెలికలు తిరిగిపోతూ ఉంది. అంతకంటే ఎక్కువగా నీలమేఘం గుండె కొంకర్లు తిరిగిపోతూ ఉంది.

చేతిలో కాగితాలు చేతిలో ఉండగానే ఒక్క లగువులో కర్ణంగారి ఇల్లు చేరుకొన్నాడు నీలమేఘం. కరణంగారి తదనంతరం అతని పెద్దకుమారుడు ఇప్పుడు కరణీకం చేస్తున్నాడు. అతని చేతిలో ఈ కాగితాల్ని పెట్టి గసపోసుకొంటూ నిలబడ్డాడు నీలమేఘం.

సమన్లని... సమన్లతో జతపరచిన కాగితాల్ని జాగ్రత్తగా పరిశీలించాడు కరణంగారబ్బాయి. "కొంపమునిగింది కదా నీలమేఘం!" అన్నాడు నెమ్మదిగా!

నాయనతరంలోనే కట్టినకొంప చెక్కుచెదరకుండా ఉంది. అల్లాంటి కొంప ఎలా మునిగిందో అర్థంచేసుకోలేక వెర్రిచూపులు చూస్తూ నిలబడ్డాడు నీలమేఘం.

"మీ అయ్య కానబావికింద ఆ దొంపు దొంపూ రెండున్నర ఎకరాచిల్లర నంజ– మీ చెల్లిలికి రాసిచ్చేశాడు కదా నీలమేఘం!"

"మా అయ్యనా?"

"మీ అయ్య కాకపోతే మీ చెల్లెలే రాయించుకొనిందనుకో!"

"నా సెల్లెలా!"

"చెల్లెలు కాకుంటే చెల్లెలి మొగుడు"

"అదెట్లా జరిగుంటుందబ్బా?"

"జరిగింది కాబట్టే– నీ బావమరది కోర్టులో దావావేశాడు. నువ్వేమైనా చెప్పుకోవలసిందుంటే చెప్పుకోమనే ఈ సమన్లు!"

"ఇదేఁవన్నా నాయంగా ఉండాదంటావా? పోనీ! మా అయ్యకు నేనేం ద్రోహం చేశానబ్బా? రేత్రనక పొగులనక తీర్చిన నేల అది. అంతోయింతో పండేదీ దాంట్లోనే!– దాన్నే రాయించుకుంటే ఇంక నా బతుకెట్లా? బతికినంతకాలం ఆయన గీసిన గీత దాటకపోతి. ఆయన మాటకు ఎదురాడకపోతి. ఆయనెందుకు జేశాడబ్బా ఇట్లా?"

"ఆయనకది తెలిసి జరిగినట్లులేదు నీలమేఘం".

"మరి?"

"నాగులమిట్ట బావికింద నాలుగ్గుంటలకయ్య– పసుపుకుంకానికి రాసియ్యమని మీ చెల్లెలు అడగతా ఉండెగదా? ఆ సాకుతోనే– బావమరిది బతకకోరి నట్లుందబ్బా?"

"అయినా ఇంతన్నేయఁవా కరణఁవయ్యా? ఆ అమ్మికి నేనొక్కడు. నాకా అమ్మి ఒక్కటి. నేనేం తక్కువ జేసినానా అమ్మికి?– నువ్వే జెప్పయ్యా? ఏనాడైనా ఆ అమ్మి నా గడప తొక్కకుండా నట్టింట అంత సాంబ్రాణి ఏశానంటావా?– ఈ నెల్లోనే గదా మా అయ్యకు యేదూడి. పొయ్‌పిల్సకరావాలనుకుంటావుంటే– ఆ అమ్మే పిలిపించెనే కోరట్టుకు!"

"ఆస్తిపాస్థులకాడికొస్తే అన్నాలేదు. చెల్లెలులేదు. అంతా భ్రమ."

నీలమేఘం కాస్త నిలదొక్కుకున్నట్లుంది.

"సరే కానీలేయ్యా! ఉండే కయ్యా గాలవ నాసోదీనంలో ఉండాది. పాలన్నం తిన్న పదిమంది పెద్దమణుసులు ఊళ్ళో ఉండనే ఉండారు. ఆయన చచ్చేటప్పుడు యేఁవారించిరాయించుకుంటే సరిపోతిందా?"

"సరిపోదు నీలమేఘం. నువ్వు మాట్లాడేది ఊరిన్యాయ్యం. ఊరిన్యాయం వేరు. కోర్టు న్యాయం వేరు."

"నువ్వు సెప్పేది బలే బాగుంది కదయ్యా? ఊరికొక నాయం. కోరట్టుకొక నాయఁవా? ఎక్కడైనా ఉంటిందా ఈ వింత?"

"చూడు నీలమేఘం! ఊళ్ళో పదిమంది చేరితే మాట్లాడేది న్యాయం. కోర్టులో మాట్లాడేది చట్టం. న్యాయానికి చట్టానికి సంబంధమే లేదు. న్యాయం కోసం చట్టం ఏర్పడింది. అయితే చట్టం చేతిలో పడి న్యాయం అన్యాయమైపోతూ ఉంది. ఊళ్ళో న్యాయం కోర్టుకెక్కితే ఉట్టికెక్కి కూర్చుంటుంది. కోర్టులో న్యాయం న్యాయంగా నిలబడితే ఈ దేశంలో ఇన్ని అవకతవక లుండేవి కావు."

"మీర్జెప్పేది నాకేఁవి తలకెక్కలా? ఇప్పుడు నన్నేం జెయ్యమంటారో సెప్పండి."

"నేను జాబురాసిస్తా. పట్నానికిపో. అక్కడ మనకు తెలిసిన వకీలు ఒకాయన ఉండాడు. ఆయన చేతికీ కాగితాలివ్వు. అడిగినంత డబ్బు చేతిలో పెట్టు. ఏఁవంటాడో చూద్దాం?"

ఏమన్నాడు వకీలు?

"అదెంతపని?" అని చిటికేసి చెప్పాడు.

ఆ 'ఇంత'పనికి నీలమేఘం అయిదేండ్లు కోర్టుచుట్టూ తిరిగాడు. అడగరానివాళ్ళనంతా అడిగాడు. కాళ్ళావేళ్ళాపడి బతిమాలాడు. చేతికి మించి అప్పులు చేశాడు. అయితే ఏమయింది?– కోర్టుకెక్కిన కొంప కొళ్ళపోయింది. బంగారం పండుతూ బతుక్కి బాసటగా ఉండిన భూమి బావమరదిపరం కాబోతూ ఉంది. అది కోర్టువాళ్ళ తీర్పు!

* * * *

ఆలోచిస్తూ నడుస్తున్నాడు నీలమేఘం!

మానసికంగా అలసిపోయిన మనిషి తనకు తెలియకుండానే శారీరకంగా కూడా అలసిపోతాడు. నీలమేఘం బాగా అలిసిపోయాడు. అలిసిపోయినమనిషి అడుగు ముందుకు పడకపోయేసరికి ఒక్కక్షణం నిలబడ్డాడు.

నిలబడి గమనిస్తే తన పొలంమధ్యలోనే నిలబడి ఉన్నాడు తాను!

అది తన పొలమన్న తలంపు కలిగేకొద్దీ నీలమేఘం గుండె చెరువవుతూ ఉంది.

అతడు పుట్టింది మొదలు ఆ మట్టిమీదనే పెరిగాడు. ఆ మట్టిమీదనే తిరిగాడు. అయ్య పనిచేసుకొంటుంటే ఆ కయ్యల్లోనే ఆడుకొన్నాడు. తరువాత అయ్యతోకలసి ప్రతి అంగుళాన్ని తన చెమటతోనే తడిపాడు. చెమటతో తడిపినమట్టి చేతికి బంగారం కాకపోయినా పిడచపెట్టింది.

ఈ భావన మనస్సులో మెదిలేసరికి నీలమేఘం నిజంగా పిచ్చివాడయ్యాడు.

దుక్కిచేసినకయ్యలో దోసెడు మట్టిని జవురుకొన్నాడు. ఆ మట్టినట్లానే చూస్తూ పలపల కన్నీళ్ళు రాల్చాడు. కన్నీళ్ళతో తడిసినమట్టిని ఒళ్ళంతాపులుముకొన్నాడు. నవనవలాడుతున్న జొన్న పైరులో సందెడు దంటుల్ని జవురుకొని జుట్టుపీక్కుంటూ దుక్కిచేసిన కయ్యమీదపడి దొర్లాడు.

ఎంతచేసినా ఏమిచేసినా గుండెల్లోమంట!– అది ఆరేదితీరేది కాదు.

అంతలోనే మళ్ళీ పైకిలేచాడు. తాను చేజేతులా పెట్టినచెట్లు. తాను పెంచుకొన్న ఆశల్లా ఏపుగా పెరిగిఉన్నాయి. ఆ చెట్లను పిచ్చిగాచూస్తూ నిలబడ్డాడు.

అప్పుడు కంటబడిందొక గొడ్డు. దొంగగొడ్డు. అవురావురుమని పైరు మేస్తూ ఉంది.

తెల్లారితే పొలం తనదికాదని తెలుసు. ఆ పొలంలో పంట తనదికాదని తెలుసు. అయినా ఆ పంట!– తాను చెమటోడ్చి పండించిన పంట. ఎవళ్ళదో దొంగగొడ్డు మేస్తూవుంటే చూస్తూ సహించలేకపోయాడు.

"ఇంతబాగా కల్లేసివుంటే– దీనెమ్మానాయాలిగొడ్డు ఎట్లా దూరిందబ్బా? కొమ్ముల్తో కుమ్మికుమ్మి ఎట్లానో సందుజేసికొన్నిట్లుండాది?– సట్టాన్ని సందుజేసుకొని నాబావార్ది దూర్నెట్టు దూరిందే దీనెమ్మా నాయాలిగొడ్డు!" అని గొణుక్కొంటూ దుక్కిచేసినకయ్యలో నిలబడ్డాడు.

వంగివంగి మట్టి పెళ్ళలందుకొని ఆ గొడ్డుమీద ఒక్క మోపన రువ్వుతున్నాడు. ఆ దెబ్బలతో ఆగొడ్డు రెచ్చిపోయింది. ఒక్క ముంపులో దూరి నీలమేఘం పైనబడింది. నీలమేఘం వొడిసి కొమ్ముల్ని పట్టుకొన్నాడు.

రెండు కొండలు తలపడినట్లుంది.

ఒడిసి పట్టుకొట్టుకొన్న కొమ్ముల్తో వాటంగా మెడను తిప్పి మోకాలితో డొక్కలో ఒక్కొక్క కుమ్ము కుమ్ముతున్నాడు నీలమేఘం. ఆ గొడ్డు పుర్రుబారుతూ బారెడు వెనక్కు పోతూ ఉంది. అక్కడ నిలదొక్కుకొని కాలుగీరి ఖణిల్లని రంకేసి మోరముందుకుసాచి ఒక్కనెట్టునెట్టుతూఉంది. రెండు బారలు వెనక్కు తగ్గుతున్నాడు నీలమేఘం!

ఒక్కజీవి మానసికంగా దెబ్బతిన్నది. ఇంకొక్కజీవి శారీకంగా దెబ్బతిన్నది. రెండూరెండై ఒకదానికొకటి తీసిపోకుండా పెనుగులాడుతున్నాయి.

ఆ జీవుల్లో ఒకటి మనిషి. ఇంకొకటి గొడ్డు.

మనిషి మనిషే! గొడ్డు గొడ్డే!!

అందులో ఎప్పుడో తెల్లవారుజామున తాగిన దోసెడు చద్దినీళ్ళు. కోర్టువరండాలో పడిగాపులు కాచికాచి బయట పడేసరికి– కడుపు నిండినంతపని అయింది. అయినా పౌరుషం కొద్దీ పోరాడుతూనే ఉన్నాడు ఆ దొంగగొడ్డుతో!

పౌరుషానికి శక్తి తోడైనపుడు పరిస్థితి వేరు.

శక్తివిహీనమైన పౌరుషం– గొడ్డు శక్తిముందు తట్టుకొని నిలబడలేకపోతూ ఉంది.

గొడ్డుతో మనిషి ఎంతసేపని పోరాడగలుగుతాడు?

నీలమేఘం శక్తి సన్నగిల్లేకొద్దీ దొంగగొడ్డు విజృంభిస్తూ ఉంది. ఆ గొడ్డు ఒక్క మోపన నెట్టుకొంటూ నెట్టుకొంటూ వెళ్ళి ఒక్కనెట్టునెట్టి వదిలింది!

పొలం మధ్యలోవున్న బావిలో ధబీ మని పడ్డాడు నీలమేఘం!

విజయగర్వంతో దొంగగొడ్డు కాలుగీరి ఖణిల్లని రంకేసింది!!

గొడ్డు నెట్టేసరికి నీలమేఘం తలక్రిందులుగా పడ్డాడు. తల దొరువుమీద పడి టెంకాయ పగిలినట్లు ఒప్పులుగా పగిలింది. దొర్లి బావి నీళ్ళల్లో పడింది.

లోకం నిండా చీకటి. బావి అడుగులో నీళ్ళు. చీకటితో కలసిన నీళ్ళు చిక్కబడ్డాయి. చిక్కబడిన చీకటిలాంటి నీళ్ళను ఒక అమాయక ప్రాణి రక్తం రంగు మార్చలేక తానే రంగు మార్చుకొని రాజీపడింది! ●

**స్వాతి మాసపత్రిక**
(1, నవంబర్ 1981)
ప్రథమ బహుమతి